RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక
The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 37 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | శుక్రవారం 15-5-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి
R N I No. APTEL/2012/53127
The Voice of Telangana

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## స్త్రీ నిధిలో జరుగుతున్న
# అక్రమాలపై స్పందించాలి

**– మంత్రి సీతక్కకు కవిత విజ్ఞప్తి**



హైదరాబాద్ మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు.

2లో..

# ఏపీలో విస్తరణకు ఉబెర్ రెడీ

**– చంద్రబాబు, లోకేష్‌తో సంస్థ సీఈవో భేటీ**



**అమరావతి** ప్రముఖ రైడ్–హెయిలింగ్ సంస్థ ఉబెర్, ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ మేరకు ఉబెర్ గ్లోబల్ సీఈఓ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైంది. ఈ భేటీలో రాష్ట్రంలో పెట్టుబడులు, విస్తరణ అవకాశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ విశాఖపట్నంలోని తమ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను విస్తరించాలని ఉబెర్ యోచిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా తమ కార్యకలాపాలకు అవసరమైన నైపుణ్యాల కోసం

2లో..

# విద్యార్థుల భవిష్యత్ 'డీమానిటైజ్' అయింది

**– పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి**
**– నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందన**
**– విద్యార్థుల భవిష్యత్ నిర్వీర్యం అయిందని ఆవేదన**
**– నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్**



**హైదరాబాద్** నీట్–యూజీ 2026 రద్దుపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ నియంతృత్వ నిరంకుశ నిర్ణయంగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష రద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత పదేండ్లుగా ప్రధాని నరేంద్రమోడీ హయాంలో 93 పేపర్లు లీక్ అయ్యాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని మండిపడ్డారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శలు గుప్పించారు. నీట్ యూజీ 2026 రద్దు అంశం దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, ఇది కూడా పెద్ద నోట్ల రద్దు వంటిదేనని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన నిర్ణయాలు దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని మండిపడ్డారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు, దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది తల్లిదండ్రులు నగలు అమ్మి తమ పిల్లలను నీట్ ఎగ్జామ్‌కు ప్రిపేర్ చేయించారని వారి ఆశలన్నీ గల్లంతవ్వడం బాధాకరం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ విడుదల చేసిన "ది పేపర్ లీక్ డికేడ్" శ్వేతపత్రం ప్రకారం కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ వైఫల్యాల వల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని మండిపడ్డారు. 2024లో కేవలం 8

2లో..

## ఇక కార్లలోనూ డాల్బీ అట్మాస్ సౌండ్

**– గూగుల్ లేటెస్ట్ అప్ డేట్!**




న్యూఢిల్లీ ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్, తమ ఆండ్రాయిడ్ ఆటో ప్లాట్‌ఫామ్‌లో సరికొత్త ఫీచర్‌ను జోడించింది. వినియోగదారులకు కార్లలో మరింత నాణ్యమైన, స్పష్టమైన ఆడియో అనుభూతిని అందించేందుకు డాల్బీ అట్మాస్ సపోర్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. సపోర్ట్ ఉన్న యాప్‌లు, కార్లలో ఈ ఫీచర్ లభించనుంది. తొలి దశలో బీఎండబ్ల్యూ, మహీంద్రా, మెర్సిడెస్–బెంజ్, రెనో, స్కోడా, టాటా, వోల్వో వంటి కార్లలో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఆడియోతో పాటు వీడియో నాణ్యతపై కూడా గూగుల్ దృష్టి సారించింది. ఆండ్రాయిడ్ ఆటోలో తొలిసారిగా ఫుల్ హెచ్‌డీ (1080పి) 60ఎఫ్‌పీఎస్ వీడియో స్ట్రీమింగ్‌కు సపోర్ట్ ప్రకటించింది. దీంతో పాటు ఆండ్రాయిడ్ ఆటో యూజర్ ఇంటర్‌ఫేస్‌ను కూడా 'మెటీరియల్ 3 ఎక్స్‌ప్రెసివ్' డిజైన్‌తో పూర్తిగా మార్చింది. దీనివల్ల కొత్త ఫాంట్లు, ఆకర్షణీయమైన యానిమేషన్లు, వాల్‌పేపర్లు లభిస్తాయి.అంతేకాదు, గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా గూగుల్ మ్యాప్స్‌కు అతిపెద్ద అప్‌డేట్ వచ్చింది. 'ఇమ్మర్సివ్ నావిగేషన్' పేరుతో 3డీలో భవనాలు, ఓవర్‌పాస్‌లు, రోడ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి వివరాలను ఇది స్పష్టంగా చూపిస్తుంది. అలాగే, ఫోన్‌లోని జెమినీ ఏఐ ఫీచర్లను నేరుగా కార్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌పై ఉపయోగించుకునే సౌకర్యం కూడా కల్పించారు. గూగుల్ బిల్ట్–ఇన్ ఉన్న కార్లలో జూమ్ వంటి మీటింగ్ యాప్‌లకు కూడా సపోర్ట్ లభించనుంది. ఈ కొత్త ఫీచర్లన్నీ సపోర్ట్ చేసే కార్లలో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

## నిప్పుల కొలిమిలా
# తెలంగాణ

**– రాష్ట్రంలో మరింత పెరగనున్న ఎండలు**
**– రానున్న రోజుల్లో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు**
**– పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ**



**హైదరాబాద్** రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతోంది. ఉదయం 8 గంటలకే ఇంట్లో నుంచి కాలు బయటపెట్టాలంటేనే జనం జంకుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు భానుడి భగభగలు కొనసాగుతూనే ఉన్నాయి. మధ్యాహ్నం పూట రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు తాజాగా వాతావరణ శాఖ అధికారులు కీలక విషయాలు చెప్పారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరగనున్నట్లు తెలిపారు. మరీ ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు ఏకంగా రెడ్ అలర్ట్ జారీ చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రానున్న 3 రోజుల పాటు ఉత్తర తెలంగాణలో సూర్యుడి ప్రతాపం తీవ్రరూపం దాల్చనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. మరీ ముఖ్యంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక రాష్ట్రంలోని మిగిలిన అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అత్యధికంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తీవ్ర హెచ్చరికలు

2లో..

## వారానికి ఒక రోజు
# 'నో వెహికల్ డే'

**– ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు**
**– ఇంధన పొదుపుపై ప్రధాని నరేంద్ర మోదీ సూచనలు**
**– ఏపీ మంత్రివర్గ సమావేశంలో పొదుపుపై సుదీర్ఘ చర్చ**
**– మంత్రుల పర్యటన ఖర్చులు తగ్గించుకోవాలని సూచన**



**అమరావతి** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతను గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు సంచలన నిర్ణయాలకు వేదికైంది.

పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల ఇంధన పొదుపు పాటించాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుకు స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వం భారీ పొదుపు చర్యలను ప్రకటించింది. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ భేటీలో కేవలం పాలనా పరమైన నిర్ణయాలే కాకుండా, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ వ్యయం తగ్గింపుపై కేబినెట్ ప్రత్యేక దృష్టి సారించింది రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా వారానికి ఒకరోజును నో వెహికల్ డే గా పాటించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆ రోజున మంత్రులు, ఉన్నతాధికారులు తమ సొంత, అధికారిక వాహనాలను పక్కన పెట్టాలని సీఎం సూచించారు. దానికి బదులుగా ప్రజా రవాణా ఆర్టీసీ బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాలు లేదా సైకిళ్లను వాడాలని నిర్ణయించారు. సామాన్యులకు ఆదర్శంగా నిలిచేలా మంత్రులందరూ ఈ నిబంధనను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం తీర్మానించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే తమ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించుకోగా, ఇప్పుడు ఆ నిర్ణయాన్ని మంత్రులందరికీ వర్తింపజేయాలని కేబినెట్ నిర్ణయించింది. జిల్లాల పర్యటనల్లో కూడా భద్రతా ప్రోటోకాల్ దెబ్బతినకుండా వాహనాల వినియోగాన్ని పరిమితం చేయాలని ఆదేశించారు. అనవసరమైన విదేశీ పర్యటనలను కూడా కొన్నాళ్ల పాటు వాయిదా వేసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు. పాలనా యంత్రాంగంలో ఆధునిక సాంకేతికతను జోడించి ఖర్చులను తగ్గించాలని కేబినెట్ నిర్ణయించింది. సచివాలయానికి లేదా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం కల్పించాలని, వీలైనంత వరకు సమావేశాలను వర్చువల్ పద్ధతిలోనే నిర్వహించాలని నిర్ణయించారు. ఇది రవాణా ఖర్చులను తగ్గించడమే కాకుండా, సమయాన్ని కూడా ఆదా చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీ టెంపరేచర్‌ను 24 నుండి 27 డిగ్రీల మధ్య నిర్వహించడం ద్వారా విద్యుత్ ఆదా చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ భవనాలు కార్యక్రమాల్లో సోలార్ ఎనర్జీ వినియోగాన్ని పెంచాలని, అట్టహాసంగా చేసే ఖర్చులను నియంత్రించాలని నిర్ణయించారు.

అమరావతి నిర్మాణ పనులపై కూడా చర్చించిన కేబినెట్, అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యం అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ పొదుపు చర్యల ద్వారా ఆదా అయ్యే నిధులను రాష్ట్రంలోని ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

## తెలంగాణ ఇంటర్‌లో
# భారీ మార్పులు

**– ఇక ఫస్ట్ ఇయర్ నుంచే ప్రాక్టికల్స్**
**– మ్యాథ్స్ సబ్జెక్టులోనూ కీలక మార్పులు**




**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో కీలక మార్పులు తీసుకువస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు కలిసి ఈ మార్పులకు శ్రీకారం చుట్టాయి. 2026–2027 అకడమిక్ ఇయర్ నుంచే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో ఈ సరికొత్త మార్పులు అమల్లోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త ఇంటర్ విద్యా విధానంలో భాగంగా మ్యాథమేటిక్స్ సబ్జెక్టుతోపాటు ప్రాక్టికల్స్ పరీక్షల మార్కుల్లో మార్పులు చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో భయం లేకుండా వాటిపై మరింత ఆసక్తి పెంచేందుకే ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి.

2లో..

## అన్నీ మీరే చేస్తే.. ఇక మేమెందుకు.?

**– కేంద్రానికి సుప్రీం చీవాట్లు**



**న్యూఢిల్లీ** దేశంలో అన్ని వ్యవస్థల్ని నియంత్రిస్తోందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎన్డీయే ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్, సీబీఐ డైరెక్టర్ వంటి కీలక నియామకాల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సుప్రీంకోర్టులో కేంద్రం ఇరుకునపడింది. అయినా తమ చర్యల్ని సమర్థించుకునేందుకు ప్రయత్నించింది.సీబీఐ డైరెక్టర్‌ను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా

2లో..

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
శుక్రవారం, మే 15, 2026

## మొక్కజొన్న కొనుగోలు

# కేంద్రం తనిఖీ చేసిన కలెక్టర్

**- గిడ్డంగుల వద్ద అన్ లోడింగ్ ప్రక్రియ పరిశీలన**



**నిజామాబాద్, మే 14 : (తెలంగాణ వాణి ప్రతినిధి)** మోపాల్ మండలం శ్రీరాంనగర్ తండాలో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్ శివారులోని గోడౌన్ ను సైతం కలెక్టర్ సందర్శించారు. ముందుగా కొనుగోలుకేంద్రంను తనిఖీ చేసి, రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. మొక్కజొన్న పంట నాణ్యత, తేమ శాతంను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్ ద్వారా తూకం సరిగా చేస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు పూర్తయ్యింది, ఇంకా ఎంత పరిమాణంలో పంట సేకరణ జరగవలసి ఉన్నదని తదితర వివరాలు అడిగి తెలుసుకుని, అధికారులకు సూచనలు చేశారు. రైతులు పంట ఉత్పత్తులు కేంద్రానికి తెచ్చిన వెంటనే నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉంటే వెంటనే తూకం వేయించాలన్నారు. సేకరించిన పంటను వెంట వెంటనే గోడౌన్లకు తరలించాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురిస్తే ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున త్వరితగతిన మొక్కజొన్న నిల్వలను గోడౌన్లకు తరలించి జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. అవసరమైన సంఖ్యలో హమాలీలను సమకూర్చుకుని, మొక్కజొన్న రవాణాలో జాప్యానికి తావులేకుండా సరిపడా లారీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు నిర్దిష్ట గడువు లోపు బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతులకు ఏ దశలోనూ అసౌకర్యం కలగకుండా చూడటం అధికారుల బాధ్యత అని అన్నారు. అనంతరం శ్రీనగర్ లోని గోడౌన్ ను కలెక్టర్ సందర్శించారు. మొక్కజొన్న నిల్వల అన్ లోడింగ్ తీరును, మొక్కజొన్న బస్తాలను భద్రపరుస్తున్న విధానాన్ని పరిశీలించారు. గోడౌన్ లో పూర్తి సామర్థ్యం మేరకు పంటను నిల్వ చేయాలని, పంటకు ఎలాంటి నష్టం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న స్టాక్‌ను త్వరితగతిన తరలించేందుకు తగినన్ని లారీలు, ఇతర రవాణా వాహనాలను వెంటనే ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా కొనుగోళ్లను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రేఖా నాయక్, ఎంపీడీఓ నరేష్, మార్క్ ఫెడ్ సిబ్బంది భాస్కర్ తదితరులు ఉన్నారు.

## మైనర్ బాలిక కేసులో భగీరథ్‌ను

# వెంటనే అరెస్ట్ చేయాలి : సీపీఎం డిమాండ్




అచ్చంపేట, మే 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) మైనర్ బాలికపై నమోదైన కేసులో నిందితుడు భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల కేంద్రంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై కేసు నమోదైనప్పటికీ పోలీసులు అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా వర్ధం సైదులు మాట్లాడుతూ బాధిత బాలిక తల్లిదండ్రులు స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. అధికార ప్రభావంతో కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి. రాములు, శివకుమార్, ఎస్. వెంకటయ్య, పర్వతాలు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నిర్మల, అడ్డా కూలీల సంఘం కార్యదర్శి వెంకటయ్య, నాయకులు రాజు, మల్లేష్, గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులతో కాకా కు విడదీయరాని అనుబంధం



మందమర్రి టౌన్ మే 14 (తెలంగాణ వాణి విలేకరి) కార్మికులతో కాకా వెంకట స్వామికి విడదీయరాని అనుబంధమని 400 కోట్ల నిధులు తీసుకువచ్చి లక్ష ఉద్యోగాలను కాపాడిన ఘనత వెంకట స్వామికే దక్కుతుందని రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిని గురువారం సందర్శించా రు. ఈ సందర్భంగా మ్యాన్ వే ధ్వార మంత్రి వివేక్, ఏ సి పి కిరణ్ కుమార్, తహసి ల్ దార్ సతీష్ కుమార్ గని లోప లకు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కార్మికుల భద్రత సంస్థ లక్ష్యంగా పనిచేయాలని సూచిం చారు. గని గడువు కాలం వివరాలను అధికారులను అడిగి తె లుసుకున్నారు. నూతన గనులు నూతన ఉద్యోగాల కల్పనే ప్రభు త్వ లక్ష్యమని, కేంద్ర ప్రభు త్వ చట్టాలకు అనుగుణం గా కోల్ టెండర్ లలో పాల్గొనేల చర్యలు తీసు కుంటామని అన్నారు. ఇన్ కం టాక్స్ రద్దు సమస్య లను సి ఎం దృష్టికి తీసు కువెళతానని అన్నారు. పదవి విరమణ కార్మి కులకు పది వేల పింఛన్ అమలు అయ్యేలా ఎం పి వంశీ కృష్ణ కృషి చేస్తున్నా రని అన్నారు. మందమర్రి ఏరియాలో ఆర్ కే పి ఓ సి 2 ఫెజ్ ఏర్పాటు తో ఐ దు వే ల మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. త్వర లోనే ఫారెస్ట్ అనుమతు లు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమం లొ గని అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## బొల్లారం లో ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశం

ఎల్లారెడ్డి మే 14 తెలంగాణ వాణి ప్రతినిధి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ ఆదేశాల మేరకు నాగిరెడ్డిపేట మండలం బొల్లారం విలేజ్ చాకలి లక్ష్మి ఇందిరమ్మ ఇల్లు మండల అధ్యక్షులు శ్రీధర్ అన్న కిష్టన్న ఆధ్వర్యంలో గృహప్రవేశం జరిగింది ఇందులో భాగంగా సర్పంచ్ ప్రభు గౌడ్ అధ్యక్షుడు అనంతరాజు మరియు వార్డు మెంబర్లు కార్యకర్తలు అందరూ పాల్గొనడం జరిగింది ఎమ్మెల్యే మదన్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## వైఎస్ జగన్ను కలిసిన మామిళ్ళపల్లి రైతులు

**తాడేపల్లి** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ను మామిళ్ళపల్లి రైతులు కలిసారు. తాము పంట నిల్వ చేసుకున్న గోడౌన్పై టీడీపీ శ్రేణులు దాడి చేయడం, రాడ్లతో గోడౌన్ తాళాలు పగలగొట్టి అరాచకం చేయడం, అడ్డుకున్న తమపై దౌర్జన్యం చేసిన తీరును జగన్కు వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మిళ్ళపల్లిలో విధ్వంసం సృష్టించిన విషయాన్ని ఫోటోలు, వీడియోలుజగన్కు చూపించారు.

## పొదుపు చర్యలపై ప్రచార కార్యక్రమాలు

**అమరావతి** గురువారం నాడు రాష్ట్ర సచివాయలంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పొదుపు చర్యలపై సుదీర్ఘ చర్చ జరిగింది. నాదేశం - నా బాధ్యత పేరుతో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కొన్నాళ్ల పాటు మంత్రుల విదేశీ పర్యటనలు రద్దు అవుతాయి. వారానికి ఒకరోజు నో వెహికల్ డే.. ప్రత్యామ్నాయ రవాణాపై దృష్టిపెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పర్యటనలలోనూ కాస్ట్ కటింగ్ పాటించాలి. మెజారిటీ మీటింగ్స్ వర్చువల్ గా నిర్వహించాలని ఆదేశం ఇచచారుజ ప్రెజెన్స్ అవసరం లేని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కల్పించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల టెంపరేచర్ ను 24 నుంచి 27 మధ్య నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో ఖర్చులు తగ్గించాలి . మంత్రుల నుంచి అధికారుల వరకు వాహనాల సంఖ్యను, వినియోగాన్ని తగ్గించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# కల్లు కంపౌండ్ మాకోద్దు

**- ఖైరతాబాద్ లో మహిళల నిరసన**

**హైదరాబాద్** ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్ నగర్లో చింతల్ బస్తి నుండి సాయిబాబా గుడి రోడ్డులో కల్లు కాంపౌండ్ ఓపెన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బస్తీ మహిళలు, యువకులతో కలిసి భారీ స్థాయిలో ధర్నా నిర్వహించారు. ఈ రహదారి ఆనంద్ నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రజలకు ప్రధాన మార్గం కావడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యాలు, సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కల్లు కాంపౌండ్ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఖైరతాబాద్ నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని స్థానిక ప్రజలకు మద్దతు తెలిపారు. అలాగే బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ చైర్మన్ విప్లవ్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, నవీన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్, శివరాజ్, నరేష్ తదితర స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు బీభత్సం

**- యువకుడికి గాయాలు**

**సికింద్రాబాద్**(సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ప్రయాణికులపైకి దూసుకెళ్లడంతో వారంతా పరుగులు తీసారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. . బస్సు ఢీకొట్టడంతో యువకుడు గాయాల పాలైయాడు. తోటి ప్రయాణికులు 108 కి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడికి ప్రాథమిక చికిత్స అందించి గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పూర్తిగా

# కేంద్రం ప్రభుత్వం వైపల్యం

**- ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పూర్తిగా కేంద్రం ప్రభుత్వం వైపల్యం అని, నీట్ పేపర్ లికేజీ సంఘటన బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నేతలు మాట్లాడుతూ నీట్ పేపర్ లికేజీ సంఘటన బాధ్యత వహిస్తూ కేంద్రం విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. పగలూ రాత్రి కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 లోనూ నీట్ ప్రశ్నాపత్రం లీకైన ఉదంతం నుంచి గుణపాఠం నేర్చుకోకపోవడం వల్లే మళ్లీ ఈ ఘటన పునరావృతమైందన్నారు. లీకేజీ వెనక ఎంత పెద్దవాళ్ల హస్తం ఉన్నా, వాళ్లందరినీ పట్టుకుని కఠినంగా శికించాలన్నారు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, ఏఐఓబిసిఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల మధు యాదవ్, జెవిఎస్ విద్యార్థి సంఘం అధ్యక్షులు చేరాల వంశీ, ఓయూ ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు ఆవుల శ్రీధర్, సురేందర్, ఏంబిసి ఫోరమ్ అధ్యక్షులు అశ్వన్, ఓయూ విద్యార్థి నాయకులు ప్రభాకర్, భాను ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# రూ. 2.58 లక్షల డ్రగ్స్ పట్టివేత..

**- ఎం డి ఎం ఏ, ఓ జి కుష్, చెరస్ డ్రగ్స్ ను స్వాధీనం.**

**- కారుతోపాటు ఇద్దరి అరెస్ట్..**



**కుత్బుల్లాపూర్** బడా బాబుల పిల్లల కు డ్రగ్స్ అమ్మకాలు జరిపి భారీగా సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్ టి ఎఫ్ బి టీం ఇద్దరు ఎస్ఐలు సిబ్బంది కలిసి అరెస్ట్ చేశారు. సూరారం కొంపెల్లి హై టెన్షన్ రోడ్ లో డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నారని సమాచారం మేరకు ఎస్టిఎఫ్ బి టీం ఎస్సై బాలరాజు, సంధ్య లతో పాటు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు ఇనోవా కారును గుర్తించి నిలిపి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కారులో ఉన్న ప్రవీణ్ వద్ద బెంగళూరు నుంచి కొనుగోలు చేసుకుని తీసుకువచ్చిన 3.24 ఎటఎజీ డ్రగ్సును, ఎలిజర్ అలియాస్ సన్నీ వద్ద 36.90 ఓ జి కుష్ 7.73 గ్రాముల చెరస్ ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తో పాటు టవేటో కార్ ను కూడా సీజ్ చేశారు. పట్టుకున్న డ్రగ్స్ విలువ రూ. 2.58 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు. నిందితులను డ్రగ్స్ ను కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఎస్ టి ఎఫ్ బి టీం లీడర్ ప్రదీప్ రావు తెలిపారు.

## స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై

# స్పందించాలి

ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో చైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

# ఏపీలో విస్తరణకు ఉబెర్ రెడీ

ఆంధ్రప్రదేశ్‌ను ఒక బలమైన టాలెంట్ హబ్‌గా ఉబెర్ పరిగణించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, అమరావతిలో అభివృద్ధి చెందుతున్న క్వాంటం టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌పై ఉబెర్ ఆసక్తి కనబరిచినట్లు సీఎం వెల్లడించారు. ఈ సాంకేతికతను ఉపయోగించుకుని అధునాతన లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ అల్గారిథమ్‌లను అభివృద్ధి చేయాలని కంపెనీ భావిస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ కూడా స్పందించారు. ఉబెర్ గ్లోబల్ లీడర్‌షిప్ బృందంతో జరిగిన విందు సమావేశంలో టెక్నాలజీ, మొబిలిటీ, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పట్టణ రవాణా భవిష్యత్తు వంటి అనేక అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తును తీర్చిదిద్దే గ్లోబల్ లీడర్లతో ఆలోచనలు పంచుకోవడం ఎంతో విలువైనదని లోకేష్ పేర్కొన్నారు. ఈ భేటీతో ఏపీలో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి మరింత ఊతం లభించనుందని నిపుణులు భావిస్తున్నారు.

# విద్యార్థుల భవిష్యత్ 'డీమానిటైజ్' అయింది

వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని గుర్తు చేశారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజి రద్దు అయిన అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని ప్రధాని నరేంద్రమోడీ తన సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా పేపర్ లీకులు పరీక్షల రద్దు జరిగిన అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ)చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసింది అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు.

# తెలంగాణ ఇంటర్‌లో భారీ మార్పులు

ఇక ఇప్పటివరకు ఇంటర్మీడియట్‌లో కేవలం సెకండ్ ఇయర్‌లో మాత్రమే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండేవి. కానీ తాజాగా తీసుకువచ్చిన మార్పుల ప్రకారం ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటిదాకా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున సెకండియర్‌లో ప్రాక్టికల్స్ ఉండేవి. అయితే వీటిని ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్‌కు విడగొట్టారు. ఈ నిర్ణయం వల్ల ఫస్టియర్ నుంచే విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై పట్టు ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఇంటర్మీడియట్‌లో కీలక సబ్జెక్ట్ అయిన మ్యాథ్స్‌లో కూడా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. మ్యాథ్స్‌లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం మ్యాథ్స్ సబ్జెక్టులో 15 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా వేయనున్నారు. ఇక ఫైనల్ పరీక్షల్లో మ్యాథ్స్ సబ్జెక్టుకు ఇప్పటివరకు 75 మార్కులు ఉండగా 15 మార్కులను తీసేసి ఇక నుంచి 60 మార్కులకు మాత్రమే పరీక్షను నిర్వహించేలా ఇంటర్ బోర్డు తాజాగా కీలక మార్పులు చేసింది. మరోవైపు లాంగ్వేజీ పరీక్షల్లో కూడా కీలక మార్పులను ప్రవేశపెట్టారు. ఇంగ్లీష్, తెలుగు లేదా సంస్కృతం సబ్జెక్టులకు కూడా 100 మార్కులకు బదులుగా 80 మార్కులకే పరిమితం చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థులకు వేయనున్నారు. ఇంటర్‌లో విద్యార్థులు బట్టీపట్టే విధానాన్ని తగ్గించి వారికి జ్ఞాపకశక్తిని పెంపొందించేలా ప్రాక్టికల్స్ స్కిల్స్‌ను పెంచడమే లక్ష్యంగా ఈ కొత్త విద్యావిధానాన్ని తీసుకువచ్చినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

# అన్నీ మీరే చేస్తే.. ఇక మేమెందుకు.?

ఉన్నారని, కానీ ఎన్నికల ప్రధాన అధికారిని ఎంపిక చేసే కమిటీలో మాత్రం ఆయన లేకపోవడం ఏంటని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. ప్రజాస్వామ్యానికి మూలమైన ఎన్నికల ప్రక్రియను నడిపించే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక విషయంలోనే ప్రజాస్వామ్యం లేకపోవడమేంటని నిలదీసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియకు సంబంధించిన కేసుపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. "నాకు ఒక సందేహం కలుగుతోంది. సీబీఐ డైరెక్టర్ ఎంపికలో ప్రధాన న్యాయమూర్తి ఉన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అని మనం అనుకోవచ్చు. లేదా దీనిని చట్టబద్ధమైన పాలన అని కూడా భావించవచ్చు. కానీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి లేరా? స్వచ్ఛమైన ఎన్నికలు జరిగేలా చూడటానికి లేరా?" అని విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. సీజేఐ ఉండాలని మనం చెప్పడం లేదని, కానీ ఒక స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదు? మంత్రివర్గం నుంచే ఎందుకు ఉండాలి? మనం చాలా స్పష్టంగా ఉందాం. ఈ రోజు ప్రధానమంత్రి ఒకరిని ఎంపిక చేస్తారు. విపక్ష నేత మరొకరిని ఎంపిక చేస్తారు, వారి మధ్య అభిప్రాయ భేదం ఉంది. మూడో సభ్యుడు ప్రతిపక్ష నాయకుడి వైపే వెళ్తారా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానమిస్తూ, అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి తాను ఊహాగానాలు చేయదలచుకోలేదని అన్నారు. అలాగైతే, ప్రతిదీ నియంత్రించేది కార్యనిర్వాహక వర్గమే కదా అని జస్టిస్ దత్తా అన్నారు. ఇలాంటి నియామకాలపై నిర్ణయం వాస్తవానికి 2:1 మెజారిటీతో ఆమోదించబడుతుందని, కేబినెట్ మంత్రి ప్రధానమంత్రి వైఖరితో విభేదించే అవకాశం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రాథమికంగా మమ్మల్ని కలవరపరిచే విషయం ఏమిటంటే, కార్యనిర్వాహక వర్గానికి వీటో అధికారం ఎందుకు ఉంది? ఇన్ని పూర్వపు తీర్పులు ఉన్న తర్వాత కూడా ఈ కేసుల గురించి పార్లమెంటుకు తెలియదా? చట్టాలను రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉంది, కానీ సుప్రీంకోర్టు అంతిమ నిర్ణేత. మీకు నచ్చినా నచ్చకపోయినా చట్టాలను వ్యాఖ్యానించే అధికారం దానికి ఉంటుందని జస్టిస్ దత్తా స్పష్టం చేశారు.

# నిప్పుల కొలిమిలా తెలంగాణ



చేశారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి మధ్యాహ్నం పూట బయటికి రావద్దని హెచ్చరికలు చేశారు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరీ ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక రోగులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని హితవు పలికారు. మరీ ముఖ్యంగా ఈనెల 16, 17, 18వ తేదీల్లో తెలంగాణ వ్యాప్తంగా వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇక రాష్ట్రంలో గత 2 రోజుల నుంచి ఎండ తీవ్రత పెరగడం గమనార్హం. ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43.5 డిగ్రీల వరకు నమోదు కాగా మెదక్‌లో 42 డిగ్రీలు హైదరాబాద్ సహా మిగిలిన జిల్లాల్లో సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# ఉపసర్పంచ్ అమరయ్యకు నివాళులర్పించిన సర్పంచ్,బిఆర్ఎస్ నాయకులు.



తల్లాడ మే 14 (తెలంగాణ వాణి): తల్లాడ మండలం బాలపేట గ్రామ ఉప సర్పంచ్ అమరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు.గురువారం ఆయన దశదిన కార్యక్రమం బాలపేట వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, బాలపేట మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు, నాయకులు తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నంద్యాల పుల్లయ్య,ఆ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు ఇస్నపల్లి శ్రీనివాసరావు, నరసింహారావు నాగేశ్వరరావు కార్యక్రమానికి హాజరై అమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాల్లో మాకు ఎన్నో విలువైన సలహాలు, సూచనలు చేసేవారిని ఆయన లేని లోటు పూడ్చలేనిదని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

## తల్లాడలో ఘనంగా మాజీ యస్ సి కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి జన్మదిన వేడుకలు

- పిడమర్తి రవి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, కేక్ కట్ చేసి తినిపించించిన సరికొండ రమణమ్మ.



తల్లాడ, మే 14 (తెలంగాణ వాణి): మండల కేంద్రంలోని మట్టమ్మ హోటల్ వద్ద తెలంగాణ రాష్ట్ర మాజీ యస్ సి కార్పొరేషన్ చైర్మెన్ పిడమర్తి రవి పుట్టిన రోజు సందర్భంగా మట్టమ్మ హోటల్ నిర్వహకులు రమణమ్మ కేక్ కట్ చేసి పిడమర్తి రవి కి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమం లో టీడీపీ మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు

## ఓర్సు రమేష్ కుటుంబానికి సహాయం అందించిన ప్రైవేటు ఎలక్ట్రిషన్స్.



**తల్లాడ, మే 14 (తెలంగాణ వాణి):** ఇటీవల ఆర్టీసీ బస్సు ఢీకొచ్చి ఢీ కొట్టిన ప్రమాణంలో ప్రవేట్ ఎలక్ట్రిషన్ ఓర్సు రమేష్ మృతి చెందాడు దీంతో రమేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని తల్లాడ యూనియన్ మండల అధ్యక్షుడు ఐలూరు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు భాగస్వామ్యంతో 20,000/ సమకూర్చి కుటుంబానికి అందజేయటం ఎంతో అభినందనీయమని ప్రైవేట్ ఎలక్ట్రిషన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్నాస్ బాలరాజు అభినందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సి రావాల్సిన ఆర్థిక సాయం విషయంలో ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో కుటుంబానికి అందజేయనున్నట్లు భరోసా కల్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని మనో ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా మీడియా అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ నాయుడు తల్లాడ మండల అధ్యక్షుడు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరాజ్,నర్సిరెడ్డి,కిషోర్ ,రమేష్,జయరాజ్, కార్మిక నాయకుడు దామాల దయాకర్ పాల్గొన్నారు.

## గిరిజన చిన్నారులకు చెప్పులు అందించిన బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ అండ్ బియాండ్ డోనర్





కొత్తగూడెం (తెలంగాణ వాణి) బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ అండ్ బియాండ్ డోనర్ సంయుక్త ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని క్రాంతినగర్, గంగమ్మ కాలనీ, రాజీవ్ నగర్ గ్రామాలకు చెందిన చిన్నారులకు రూ.25 వేల వ్యయంతో చెప్పులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా, సురక్షితంగా పాఠశాలకు వెళ్లేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ నీలేష్, ఇండియన్ వాలంటీర్ రూప్లా నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచండి:కలెక్టర్ చిత్రా మిశ్రా

- రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలి
- మిల్లుల వద్ద యుద్ధ ప్రాతిపదికన అన్‌లోడింగ్ చేపట్టాలి
- కటింగులు,కోతలు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలి
- రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి:చొప్ప దండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఎమ్మెల్యే మెడిపల్లి సత్యం పోలీస్ కమిషనర్ సిపి గౌస్ ఆలం ధాన్యం కొనుగోలు పరిశీలన



**చొప్పదండి:మే 14 (తెలంగాణ వాణి)** చొప్పదండి మార్కెట్ యార్డు, అర్నకొండ లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను గురు వారం రాత్రి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ మాట్లాడి ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి,రవాణా,లోడింగ్, అన్‌లోడింగ్ తదితర అంశా లపై వివరాలు తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లా డుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవా లని సూచించారు. అవసరమైనన్ని లారీలను సమకూర్చి ధాన్యాన్ని వెంటనే తరలించాలని,మిల్లుల వద్ద యుద్ధ ప్రాతిపదికన అన్‌లోడింగ్ నిర్వహించాలని తెలిపారు.రవాణా ప్రక్రియలో జాప్యం లేకుండా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అవసరమైతే ట్రాక్టర్లను పెద్ద ఎత్తున వినియోగించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయం లో ఎలాంటి కటింగులు, కోతలు పెట్టకుండా రైతులకు పూర్తి పారదర్శకంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు సృష్టిం చే పరిస్థితులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియోజక వర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కోరారు.ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారుల కు సూచించారు.రైతులకు ఎలాంటి నష్టం,ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాం గం ప్రత్యేక దృష్టి సారించి కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్ జిల్లా పౌరసర ఫరాల అధికారి నర్సింగరావు పౌరసరఫరాల శాఖ డిఎం రజనీకాంత్ తసిల్దార్ నవీన్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# “2036 ఒలింపిక్స్ లక్ష్యంగా భారత క్రీడా విప్లవం

- గ్రామీణ ప్రతిభ నుండి ఒలింపిక్ పతకాల దిశగా” - ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకరయ్య



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)** భారతదేశం 2036 ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధమవుతున్న ఈ చారిత్రాత్మక సమయంలో, దేశంలో క్రీడా రంగాన్ని కేవలం భవనాలు, స్టేడియాలు, స్పోర్ట్స్ యూనివర్సిటీలు నిర్మించే దశలో మాత్రమే కాకుండా, గ్రామీణ స్థాయి నుండి ఒలింపిక్ స్థాయి క్రీడాకారులను తయారు చేసే సమగ్ర వ్యవస్థగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతో అత్యవసరమైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆర్చరీ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ పుట్టా శంకరయ్య గురువారం వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది బాలబాలికలు సహజసిద్ధమైన క్రీడా ప్రతిభ కలిగి ఉన్నప్పటికీ, సరైన అవకాశాలు, శిక్షణ, మార్గదర్శకత్వం, ప్రోత్సాహం లేక వారి ప్రతిభ వెలుగులోకి రావడం లేదని తెలిపారు. భారతదేశం నిజమైన క్రీడా శక్తిగా ఎదగాలంటే, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దాగి ఉన్న టాలెంట్‌ను గుర్తించి, చిన్న వయస్సు నుంచే శాస్త్రీయ శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.ఒక చిన్నారి ఒలింపిక్ స్థాయికి చేరుకోవాలంటే కనీసం 10 సంవత్సరాల నిరంతర సాధన, క్రమశిక్షణ, శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం అవసరమన్నారు. అందుకే 2026 నుండి 2036 వరకు ఒక ప్రణాళికాబద్ధమైన క్రీడా ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఇటీవల మనకు స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా ఆధ్వర్యంలోని ఎన్ ఎస్ ఆర్ ఎస్ రిజిస్ట్రేషన్, జాతీయ, అంతర్జాతీయ సిఆర్ ఎఫ్ రిజిస్ట్రేషన్లు లభించడం ఎంతో గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదని, దేశంలో పిల్లలు, యువత, వెటరన్స్‌లో క్రీడా చైతన్యాన్ని పెంపొందించే ఒక బాధ్యత కూడా అవసరమన్నారు.ప్రస్తుత ప్రభుత్వాలు స్పోర్ట్స్ యూనివర్సిటీలు ఏర్పాటు చేయడంపై దృష్టి పెడుతున్నాయని,ఇది స్వాగతించదగిన అంశమే అయినప్పటికీ, కేవలం యూనివర్సిటీలు నిర్మించడం ద్వారా మాత్రమే ఒలింపిక్ పతకాలు సాధ్యం కావన్నారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత ముఖ్యమన్నారు. ప్రత్యేకంగా పీఈటీలు (ఫిసికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ ), ఫిజికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థ దేశ క్రీడా భవిష్యత్తుకు మూలస్తంభాలుగా ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను ముందుగా గుర్తించేది పీఈటీలేనని తెలిపారు. అయితే ప్రస్తుతం అనేక పాఠశాలల్లో పీఈటీ పోస్టులు ఖాళీగా ఉండటం, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల్లో సరైన ప్రక్షాళన లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. క్రీడా అభివృద్ధి అంటే కేవలం పోటీలు నిర్వహించడం కాదన్నారు. ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో క్రీడా సంస్కృతి పెరగాలని తెలిపారు. శారీరక విద్యను విద్యా వ్యవస్థలో కీలక భాగంగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ శిక్షణ, పోషకాహారం, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ప్రత్యేకించి ఆర్చరీ వంటి భారతదేశానికి పతకాలు అందించే క్రీడలను గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గిరిజన, గ్రామీణ యువతలో సహజసిద్ధమైన క్రీడా ప్రతిభ అపారంగా ఉందని పేర్కొన్నారు. సరైన అవకాశాలు కల్పిస్తే, భవిష్యత్తులో ఒలింపిక్ స్థాయిలో భారతదేశానికి పతకాలు సాధించే శక్తి ఈ యువతలో ఉందన్నారు.మన దేశం 2036 ఒలింపిక్స్‌ను కేవలం నిర్వహించే దేశంగా కాకుండా, అత్యధిక పతకాలు సాధించే క్రీడా శక్తిగా ఎదగాలంటే --- ఇప్పటి నుంచే పిల్లలపై పెట్టుబడి పెట్టాలని వివరించారు. గ్రామీణ టాలెంట్‌ను గుర్తించాలన్నారు. పీఈటీల నియామకాలు చేపట్టాలని వివరించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ప్రతి క్రీడాకారుడికి సమాన అవకాశాలు కల్పించాలని తెలిపారు.“ఈరోజు గ్రామీణ ప్రాంతంలో విల్లు పట్టిన ఒక చిన్నారి... భవిష్యత్తులో భారత జాతీయ పతాకాన్ని ఒలింపిక్స్‌లో ఎగరవేసే ఛాంపియన్ కావచ్చు.”అని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.అదే మన లక్ష్యం...అదే మన బాధ్యత...
అదే భారత క్రీడా భవిష్యత్తు ఉంటుందని వివరించారు.

## కుక్కల కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి

- 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ డిమాండ్



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కుక్కలు ,కోతుల నివారణకు తక్షణమే చర్యలు తీసుకొని వాటి నుండి ప్రజలను రక్షించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ పరిధిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూకుక్కలు ,కోతులు పెద్దలపై ,చిన్న పిల్లలపై దాడులు చేస్తున్న అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని ఆమె అన్నారు .మున్సిపల్ సిబ్బందిపైకూడా రెండు సందర్భాల్లో కోతులు, కుక్కలు దాడి చేసినా అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయమని అన్నారు. నిన్న పాల్వంచలో జరిగిన శిశువు తలను కుక్కలు తినడం దురదృష్టకరమైన ఈ సంఘటనను చుసిన తరువాత కూడా కార్పొరేషన్ అధికారులు మేలుకొని కుక్కలు ,కోతుల నివారణ పట్ల చర్యలు తీసుకోవాలని మరొక్కసారి అధికారులను డిమాండ్ చేశారు. కోతుల, కుక్కల నివారణ పట్ల అధికారులు చర్యలు తీసుకోనట్లయితే ప్రజలను సమీకరించి ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆమె హెచ్చరించారు.ఈ సమావేశంలో నాయకులు బెల్లం బేబీ, రావి శెట్టి పద్మ, రామ్ రాకేష్, వాసం బాబు, మార్తమ్మ, గుంజ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఖాదర్ బాబా కుటుంబాన్ని పరామర్శించిన కోనేరు చిన్ని



కొత్తగూడెం, మే 14 (తెలంగాణ వాణి) కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ రైటర్ బస్తి గొల్లగూడెంలోని కాంగ్రెస్ నాయకులు ఎండి ఖాదర్ బాబా కుటుంబాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) గురువారం పరామర్శించడం జరిగింది. ఖాదర్ బాబా తల్లి అనారోగ్యకణంతో సాహెబ్ బీ ఈ నెల 5వ తేదీన స్వర్గస్తులయ్యారు. ఈ సందర్భంగా కోనేరు చిన్ని ఖాదర్ బాబా స్వగృహానికి విచ్చేసి ఖాదర్ బాబా తల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోనేరు చిన్ని మాట్లాడుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. చిన్ని ఖాదర్ బాబాతో మాట్లాడుతూ చనిపోయిన రోజు అందుబాటులో లేనని హైదరాబాద్లో ఉన్నందున అంత్యక్రియలకు రాలేకపోయానని అందుకుగాను చింతిస్తున్నట్లు విచారం వ్యక్తం చేశారు. అనంతరం ఖాదర్ బాబా కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జల్లి శ్రీలక్ష్మి , రావి రాంబాబు గారు, కాంగ్రెస్ నాయకులు మోజెస్ కంచం గురువులు , కంచం నాగయ్య , వడ్డే బోయిన సురేష్ , శ్యామల మల్లికార్జున్ , శ్యామల వెంకటేశ్వర్లు , పౌల్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరింప చేయాలి

- ఎస్ జి టి ఉపాధ్యాయులు చేసిన సర్వే డబ్బులు ఎప్పుడు ఇస్తారు
- ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తారా
- ఎస్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు లాల్ మహమ్మద్



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరింప చేసేందుకు కృషి చేయాలని ఎస్ టి యు టి ఎస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు లాల్ మహమ్మద్ కోరారు. ఈ మేరకు గురువారం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావును జిల్లా కమిటీ ప్రత్యేకంగా కలసి రాష్ట్రం లో ఉపాధ్యాయులు ఎదురుకుంటున్న సమస్యలపై వినతిపత్రం అందించడం జరిగింది. అయితే ఎస్ జి టి ఉపాధ్యాయులు చేసిన సర్వేకు సంబంధించిన డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అసమగ్ర విద్య విధానాల వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక ప్రాథమిక పాఠశాలలో 10 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలకు 2 ఉపాధ్యాయు లు ఉండాలని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని, 2 సంవత్సరాలు నిండిన ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్ అవకాశం కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ అమలు పరచాలని, పెండింగ్ డి ఏ లను ఇచ్చి, పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు వెంటనే ఇవ్వాలని, విద్యా కమిషన్ సూచిస్తున్న అసమగ్ర విద్యావిధానాలను అమలు చేయకుండా చూడాలని ఎమ్మెల్యే అని కోరారు. విద్యా సంబంధించిన విషయాలు మేధావులతోను, ఉపాధ్యాయ సంఘాలతోను చర్చించి సరైన నిర్ణయాలు తీసుకోనే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలన్నారు.317 జీఓ వలన అనేక మంది ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించాలన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడమైనది. ఈ కార్యక్రమంలో ఎస్.టి.యు టి.ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఎండి.లాల్ మహమ్మద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి రమణ, భిక్షపతి తదితరులు హాజరైనారు.

RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
శుక్రవారం, మే 15, 2026

# సింగరేణిలో మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి సన్నద్ధత

- 13 దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్లను నడపనున్న మహిళా కార్మికులు - మహిళా శక్తికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ఆదేశంపై స్పందించిన సింగరేణి
- వివిధ క్లిష్టతర బాధ్యతల నిర్వహణపై ఆసక్తి గల మహిళలకు అవకాశాలు - డంపర్ ఆపరేటర్ల నియామకాల్లో మహిళలకు కూడా అవకాశం
- శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 13 మంది మహిళా ఉద్యోగులు






**కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)** మహిళాభివృద్ధికి అధిక ప్రాధాన్యనిస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థలో కూడా మహిళా శక్తికి ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని ఆదేశించడంతో సింగరేణి చరిత్రలో తొలిసారిగా భారీ డంపర్ల ఆపరేటర్లుగా కొందరు మహిళలకు కంపెనీ అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదేశంపై సింగరేణి యాజమాన్యం మహిళా డంపర్ ఆపరేటర్ల నియామకానికి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు, ఓవర్ బర్డెన్ ను గని క్వారీ నుండి ఉపరితలానికి రవాణా చేయడానికి యాజమాన్యం 60 నుంచి 100 టన్నుల భారీ డంపర్లను వినియోగిస్తుంది. సింగరేణిలో గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇప్పటివరకు కేవలం పురుష ఆపరేటర్లు మాత్రమే ఈ భారీ డంపర్ లను నడుపుతూ వస్తున్నారు. ఈ డంపర్లను నడపడం కొంత కష్టంతో పాటు శారీరక దృఢత్వం, డ్రైవింగ్ నైపుణ్యం అవసరమై ఉంటాయి, పైగా మండే ఎండల్లోనూ, భారీ వర్షాలు, తీవ్రమైన చలి పరిస్థితులను తట్టుకొని మూడు షిఫ్టుల్లో కూడా డంపర్లు నడపాల్సి ఉంటుంది. ఇంత కష్టతరమైన పనిని పురుష ఆపరేటర్లు మాత్రమే నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే సింగరేణి సంస్థలో ఇటీవల మహిళా ఉద్యోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల్లో డంపర్ ఆపరేటర్లుగా పని చేయడానికి ఆసక్తి గల మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులనుకోరింది.మొదట దాదాపు 35 మంది వరకు ముందుకు వచ్చారు. అయితే భారీ డంపర్లను నడపడానికి వారికి అంతకుముందే సాధారణ డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు భారీ వాహనాలను నడిపే లైసెన్స్ కూడా అవసరమై ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న యాజమాన్యం సిరిసిల్లలో ఉన్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)అనే సంస్థ ద్వారా ఆసక్తి గల మహిళలకు కంపెనీ ఖర్చులతో భారీ వాహనాలపై ఉచిత డ్రైవింగ్ శిక్షణను అందించింది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 13 మంది మహిళా ఉద్యోగులు తాము డంపర్ ఆపరేటర్లుగా పనిచేయటానికి సంసిద్ధంగా ఉన్నామని కంపెనీకి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వీరందరికీ త్వరలో విడుదలయ్యే డంపర్ ఆపరేటర్ల నియామకల్లో అవకాశం కల్పించనున్నట్లు యాజమాన్యం తెలిపింది. పురుషులకు మాత్రమే పరిమితమైన కఠినమైన పనుల్లో మహిళలకు సైతం ప్రాధాన్యతనిస్తూ సింగరేణి సంస్థ తొలిసారిగా డంపర్ ఆపరేటర్లుగా మహిళలకు కూడా అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఈ విధంగా అనతి కాలంలోనే సింగరేణి సంస్థలో భారీ డంపర్లపై మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కనపడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా కొందరు మహిళా ఆపరేటర్లు మాట్లాడుతూ, భారీ డంపర్లను నడపడం శారీరక కష్టం, నైపుణ్యంతో కూడుకున్న పని అని, తాము చేయగలమో లేదో అని కొంతభయపడినప్పటికీ, స్వయంగా డంపర్లు నడుపుతున్నప్పుడు తాము కూడా ఇటువంటి పనులు చేయగలమన్న ఆత్మవిశ్వాసం కలగిందన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాలతో పాటు రోదసిలోకి వెళ్తున్నారని కనుక గనిలోని డంపర్లను మహిళలు నడపడం అంత కష్టమేమీ కాదని, ఇటువంటి మంచి అవకాశాన్ని కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి తాము ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఖైరీగూడ ఓపెన్ కాస్ట్ గనిలో అత్యంత క్లిష్టమైన బ్లాస్టింగ్ విభాగంలో కూడా కేవలం మహిళలను మాత్రమే నియమించగా వారు పురుష ఉద్యోగులతో సమానంగా బ్లాస్టింగ్ ను నిర్వహిస్తున్నారు. అలాగే ఇతర విభాగాల్లో కూడా మహిళలు రాణిస్తున్నారని ఒక అధికారి పేర్కొన్నారు. సంస్థ చరిత్రలో తొలిసారిగా మహిళా రెస్క్యూ జట్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇలాగే ఇకపై కూడా వివిధ క్లిష్టతరమైన ఉద్యోగాలలో ఆసక్తి గల మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# ఇంద్రవెల్లి ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు

## - హాజరైన కలెక్టర్ రాజర్షి షా



**ఇంద్రవెల్లి, మే : 14 ( తెలంగాణ వాణి )** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచి బలోపేతం చేయడమే ప్రభుత్వం యొక్క ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని పిఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వ సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచి వాటిని బలోపేతం చేయడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ఏడాది పదవ తరగతి ఫలితాల్లో ఇంద్రవెల్లి పాఠశాల విద్యార్థులు చూపిన ప్రతిభపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 271 మంది విద్యార్థులకు గాను 270 మంది ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమని, ఈ అద్భుత ఘనత సాధించిన ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం ఉన్న 64 శాతం హాజరును ఈ విద్యా సంవత్సరం మొదటి వారం నుంచే కనీసం 75 శాతానికి పెంచాలని ఉపాధ్యాయులను, స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు. ఎండలు, వర్షాలు వంటి కారణాలతో విద్యార్థులు బడికి దూరం కాకూడదని, ప్రతి రోజూ విద్యార్థులు బడికి వచ్చేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మారుమూల గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అవసరమైతే ఉపాధ్యాయులు స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి తల్లిదండ్రులను ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఇంద్రవెల్లి పాఠశాల ఇంగ్లీష్ మీడియం కావడంతో, విద్యార్థులు తమ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని, నిత్యం ఆంగ్ల వార్తాపత్రికలు చదివే అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. సరైన చదువు ఉంటేనే విద్యార్థులు సివిల్ సర్వీసెస్, గ్రూప్స్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించగలరని వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించి, వారికి బహుమతులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపిడిఓ జీవన్, ఎమ్మార్వో ప్రవీణ్, సర్పంచ్ రాథోడ్ మోహన్ సింగ్, మార్కెట్ చైర్మన్ ఉత్తమ్, ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

## - సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు



**ఉట్నూర్, మే : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి )** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ -ఉట్నూర్ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు అన్నారు. గురువారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ- ఉట్నూర్ పరిధిలోని ఆదిలాబాద్ రూరల్ మండలం బుర్కి, మాంగ్లి గ్రామాలను సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమ, అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. ఆదివాసి గిరిజన ప్రాంతాలలో విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తూ గిరిజన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందించడంతో పాటు, మారుమూల ప్రాంతాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన గిరిజనులకు ప్రధానమంత్రి జన్ మన్, జుగా పథకాలను అమలు చేయడంతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా గిరిజన గ్రామాలలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, గ్రామాలలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువలు శుభ్రంగా ఉండేలా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సభ్యుల ఐక్యతతో భవన నిర్మాణం

- అభివృద్ధిపైనే ప్రధాన దృష్టి..- నిజామాబాద్ కార్పొరేషన్ కు రింగు రోడ్డు అవసరం..
- కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్..



**నిజామాబాద్ మే 14: (తెలంగాణ వాణి ప్రతినిధి)** ప్రభుత్వంపై ఆధారపడకుండా కాలనీవాసులు ఐక్యతతో కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం అభినందనీయమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఓల్డ్ ఎన్జీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నగరంలోని అన్ని డివిజన్లలోకెల్లా అత్యధికంగా వ్యాపారులు, మేధావులు, విద్యావంతులు ఎన్జీవోస్ కాలనీ ఉన్నారన్నారు. అందరి కృషితోనే అద్భుతమైన నిర్మాణం జరిగిందన్నారు. ప్రభుత్వ సహకారం కూడా ఉండాలని, తన ఎమ్మెల్యే ఫండ్ వచ్చిన తర్వాత తన వంతు సహకారం అందిస్తానన్నారు. తన ట్రస్టు ద్వారా సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే పాత పనులపై అనేకసార్లు మంత్రులు అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. తొందర్లో సీఎం ని కలిసి నగరాభివృద్ధి కోసం లేఖను అందించనున్నట్లు చెప్పారు. ఎలక్షన్ల ముందే రాజకీయమని, తర్వాత అందరినీ కలుపుకొని అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఎంపీ ధర్మపురి అరవింద్ సహకారంతో కేంద్ర నిధులు పుష్కలంగా అందుతున్నాయన్నారు. లి రాష్ట్రంలో మూడు జిల్లాలకు రింగ్ రోడ్డు కేటాయించారన్నారు. కానీ నిజామాబాద్ కేటాయించకపోవడం దురదృష్టకరమని వాపోయారు. రాష్ట్రంలో వరంగల్ తర్వాత అతిపెద్ద నగరం నిజామాబాద్ అని, అయినా మంజూరు చేయలేదన్నారు. అలాగే రాష్ట్రంలో ఒక్క రూపాయి కూడా స్పెషల్ ఫండ్ మంజూరు కానీ నియోజకవర్గ నిజామాబాద్ ఒక్కటేనన్నారు. పక్కనే ఉన్న రూరల్ కు అందజేస్తున్నారు కానీ ఇందురుపై వివక్ష చూపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, నూడా చైర్మన్ కేశ వేణు వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, కార్పొరేటర్లు జ్యోతి, మురళి, నాగోల్ల లక్ష్మీనారాయణ, పరమేశ్వర్, మఠం పవన్, ప్రవీణ్ గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు పోతనకర్ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వాసు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 20వ తేదీన

# దేశవ్యాప్త మెడికల్ షాపుల సమ్మె

- ఒక్కరోజు సమ్మె పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కెమిస్ట్ అసోసియేషన్
- కెమిస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, రవి



**కొత్తగూడెం (తెలంగాణ వాణి)** ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా ఒక్కరోజు మెడికల్ షాపులను బందు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కెమిస్ట్ అండ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి. తిరుపతిరెడ్డి, కంభంపాటి రవి పేర్కొన్నారు. గురువారం ఎందుకు సంబంధించి పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వాడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆన్లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న విపరీత డిస్కౌంట్ విధానానికి దేశవ్యాప్త బంధు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందుల షాపుల యజమానులు బంద్ చేస్తున్నప్పటికీ అత్యవసరంగా కావలసిన మందులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 13 లక్షల మందుల షాపుల మనుగడకు ప్రమాదం ఏర్పడబోతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల మందుల షాపుల భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడబోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లక్షణాచారి, కొత్తగూడెం అధ్యక్షుడు అనిల్, సెక్రెటరీ వెంకటేశ్వర్లు, భద్రాచలం కమిటీ అధ్యక్షుడు సోమశేఖర్, సెక్రెటరీ నాగేశ్వరరావులతొ పాటు పలువురు కెమిస్టు పాల్గొన్నారు.

### టియుడబ్ల్యూజే ఐజేయు మహాసభలను

# జయప్రదం చేయండి

- పోస్టర్ ఆవిష్కరించిన మహాసభ కమిటీ సభ్యులు



కొత్తగూడెం (తెలంగాణ వాణి) కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఈ నెల 24న జరగనున్న టియుడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఐజేయు జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్ 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జర్నలిస్ట్ లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యెర్రా ఈశ్వర్, ఎర్రుల సుధాకర్, బాపట్ల మురళి, వెంకట భాస్కర్, షేక్ జానీ, బండ్ల వెంకట్, ఆర్ఎస్ రామానుజం, గుణ సురేష్, దశరద్ రజ్వా, అఫ్జల్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీతలకు గని పై ఘన సన్మానం



మందమర్రి టౌన్ మే 14 (తెలంగాణ వాణి విలేకరి) మందమర్రి ఏరియాలోని కేకే 5 గని పై ఇటీవల శ్రమశక్తి అవార్డు లు పొందిన గ్రహీతలకు గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్వెంకట స్వామి అవార్డు గ్రహీతలు ఏడుకోల పవన్ కుమార్, పుల్లూరి లక్ష్మన్ లను శా లువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల సాధనే లక్ష్యంగా పని చేయాలని గ్రహీతలకు సూచించారు. అనంతరం అవార్డు గ్ర హీతలు ఏడుకోల పవన్ కుమార్, పుల్లూరి లక్ష్మన్ లు మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న గని పై కార్మికుల సమక్షం లొ రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా సత్కారం పొందడం జీవితములో మరచి పోలేని జ్ఞాపకమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్, జి ఎం రాధకృష్ణ లకు ధన్యవాదా లు తెలిపారు. ఈ కార్యక్రమం లొ ఎస్ ఓ టు జి ఎం ప్రసాద్. గని మేనేజర్ శంబునాధ్ పాండే, తహసీల్దార్ సతీష్ కుమార్,మున్సిపల్ కమీషనర్ రాజలింగు, ఐ ఎన్ టి యు సి నాయకులు కాంపెల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, ఏ ఐ టి యు సి నాయకులు కంది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### దామరచర్ల మత్స్య సహకార సంఘం

# చైర్మన్‌గా నూకల అంజి ఎన్నిక



దామరచర్ల, మే 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) దామరచర్ల మండల మత్స్య సహకార సంఘం నూతన కార్యవర్గానికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సంఘం చైర్మన్‌గా నూకల అంజి (ముదిరాజ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బుడిగ లక్ష్మయ్య, కార్యదర్శిగా తోకల బాలసైదులు ఎన్నిక కాగా, సభ్యులుగా వాడపల్లి శ్రీరాములు,నూకల రాము, తోకల బాలసైదులు, అదెమ్మ, వెంకటమ్మలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ నూకల అంజి మాట్లాడుతూ మత్స్య కార్మికుల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మత్స్యకారుల అభివృద్ధి కోసం అవసరమైన పథకాలను, రాయితీలను అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన ప్యానల్‌ను నమ్మి ఓటు వేసి గెలిపించిన మత్స్యకార సంఘం సభ్యులందరికీ ఆయన ఈ సందర్భంగా పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు మత్స్యకార నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# యూరియా వాడకాన్ని తగ్గించి నానో ఎరువులను వాడండి.



పెద్దపల్లి :మే, 14 (తెలంగాణ వాణి ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా అంతర్గం మండలం సోమనపల్లి గ్రామంలో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి నానో ఎరువులను వినియోగించాలని సూచించారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను మాత్రమే సాగు చేయాలని, సాగు నీటిని ఆదా చేసే పద్ధతులను అవలంబించాలని రైతులకు సూచించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా పంటల నాణ్యత పెరగడంతో పాటు రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట శాస్త్రవేత్త డాక్టర్ ఓ. సంపత్, ఎంఏఓ కె. సతీష్, సోమనపల్లి సర్పంచ్ గుంట బాపు, ఏఈఓ డి. రమేష్ పాల్గొన్నారు.

# శకల్ల గ్రామ సర్పంచ్ పర్స రమేష్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

## బీటి కొనుగోలు శ్రామికులకు ఆరోగ్యపరం పరిగణిస్తు పంపిణీ చేసిన ఓ ఆర్ ఎస్





జగిత్యాల/ బుగ్గారం: 14 మే (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం శకల్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు సెంటర్ ను సందర్శించి గ్రామ సర్పంచి పర్స రమేష్ గురువారం రోజున హమాలీలకు మరియు రైతులకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మరియు కూల్ డ్రింక్స్ పంపిణీ చేయడం జరిగింది . అదేవిధంగా రైతులకు సకాలంలో గణి సంచులు అందుబాటులో ఉంచాలని సమయానికి లారీలు లోడ్ చేసి పంపాలని, లోడింగ్ అన్లోడింగ్ సమస్యలు రాకుండా చూసుకోవాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సూచించారు. సరి అయిన సకాలంలో ధాన్యం పంపించని యెడల రైతులకు ఇబ్బంది అయిన ఎడలబీటి యాజమాన్యం పై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలియజేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరి అయిన సమయంలో ధాన్యాన్ని పంపించడమే మా అధికార బాధ్యత అంటూ మాట్లాడుతూ సూచన ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నార్ల బుచ్చయ్య పంచాయతీ సెక్రెటరీ చల్ల రజిత, వార్డు సభ్యులు హెల్త్ సబ్ సెంటర్ సిబ్బంది సహన్యా వనజ , బీట్ ఇంచార్జీ శ్రీనివాస్ రైతులు, మడిపెల్లి మొండయ్య, జంగిలి లక్ష్మి రాజం, నంది తిరుపతి, మైదం రమేష్, జంగిలి దేవయ్య , కత్తెర పాక నర్సయ్య,అరికెల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# వడ్లు కొనుగోలు ప్రక్రియను వేగంగా కొనసాగించాలి

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వనపర్తి : మే 14, (తెలంగాణ వాణి ప్రతినిధి ): వనపర్తి జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై గురువారం సాయంత్రం తన ఛాంబర్ లో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలోని ఏ ఏ మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఎంతెంత వడ్లు తూకం చేసి మిల్లులకు పంపించడానికి సిద్ధంగా ఉన్నాయి, ఈ రోజు ఎంత వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చాయి, తూకం చేసి బస్తాల్లో నింపిన వడ్లు ఎన్ని క్వింటాళ్ళు వంటి అంశాల పై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో గురువారం మొత్తం 382 కొనుగోలు కేంద్రాల్లో వడ్లు కొనుగోలు చేసి 6569 మెట్రిక్ టన్నుల వడ్లు తూకం చేయడం జరిగిందని సివిల్ సప్లై అధికారి వివరణ ఇచ్చారు. ఇప్పటి వరకు 69,428 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయడం పూర్తి అయిందని, అదేవిధంగా ఈ రోజు 195 లారీల్లోని వడ్లు ఆయా మిల్లుల వద్ద అన్లోడింగ్ చేసినట్లు లెక్కలు చూపించారు. స్పందించిన కలెక్టర్ పెద్దమందడి, కొత్తకోట, మదనపూర్, పానగల్ ఐ కె.పి సెంటర్లలో తూకం చేసి బస్తాల్లో నింపిన ధాన్యం నిల్వలు అధికంగా ఉన్నాయని అదేవిధంగా పి. ఎ. సి.ఎస్ కు సంబంధించి కొత్తకోట, ఆత్మకూరు, ఘనపూర్, పెద్దమందడి, వనపర్తి, గోపాల్పేట మండలాల్లో నిల్వలు అధికంగా ఉన్నందున రేపు ఈ మండలాల్లో అత్యధికంగా కారులు పంపించాల్సిందిగా డి.యం. సివిల్ సప్లై, ట్రాన్స్పోర్ట్ అధికారులను ఆదేశించారు. హమాలీల కొరత రాకుండా చూసుకోవాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. ప్రతిరోజు సమీక్ష ఉంటుందని, వడ్లు కొనుగోలులో మరింత వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్, పి డి ఆర్ డి ఓ ఉమాదేవి, కోఆపరేటివ్ అధికారి బి. రాణి, ట్రాన్స్పోర్ట్ అధికారి మానస, డిఎం సివిల్ సప్లై ఆంజనేయులు, మార్కెటింగ్ అధికారి స్వరణ్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా విజయ్ నాయుడు నియామకం

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం



చర్ల, మే 14 (తెలంగాణ వాణి) చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా విజయ్ కుమార్ నాయుడు నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీలో ఎంతోకాలంగా క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న విజయ్ కుమార్ నాయుడుకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు చేరువ చేసే విధంగా కృషి చేస్తానని విజయ్ కుమార్ నాయుడు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కార్యకర్తలందరిని కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. విజయ్ కుమార్ నాయుడు నియామకాన్ని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గిరిజన సంక్షేమ పాఠశాలలు నిర్వహిస్తాం

## ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్



భద్రాచలం మే 14 (తెలంగాణ వాణి) గిరిజన విద్యార్థినీ, విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు అనేక వసతి సౌకర్యాలు కల్పించామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం నాడు ఐటీడీఏ సమావేశ మందిరము మరియు పిఎంఆర్ సి సమావేశం మందిరంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు ఖమ్మం జిల్లా లోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న, బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన బాల,బాలికలు, 03,05,08 తరగతులకు కలిపి 621 మంది దరఖాస్తు చేసుకోగా వారిని పిల్లల తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమక్షంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా అందరి సమక్షంలో లాటరీ ద్వారా బాల బాలికలను ఎంపిక చేశామని అన్నారు. మూడవ తరగతిలో 78 సీట్లకుగాను లంబాడా తెగకు చెందిన బాలికలకు 08, జనరల్ లో బాలికలు మరియు బాలురు15, కోయ తెగకు చెందిన బాలికలకు 15 మందిని, జనరల్ లో బాలికలు మరియు బాలురకు 31 మందిని, పి వి టి జి తెగకు చెందిన బాలికలకు 02, జనరల్ లో 03, ఇతరులకు జనరల్ లో బాలికలకు ఒకటి, జనరల్ లో 03, ఐదవ తరగతిలో 39 సీట్ల గాను లంబడా తెగకు చెందిన బాలికలకు 04, జనరల్ లో బాలురు మరియు బాలికలు 08, కోయ తెగకు చెందిన బాలికలకు 07, జనరల్ లో బాలికలు మరియు బాలురు 16, పి వి టి జి తెగకు జనరల్ బాలికలు 01,మరియు బాలురకు ఒకటి, ఇతరులకు జనరల్ లో బాలికలు 01 మరియు బాలురు ఒకటి, 8వ తరగతిలో 39 సీట్లకు గాను లంబాడాకు చెందిన బాలికలు 04, జనరల్ లో బాలికలు మరియు బాలురు 08, కోయ తెగకు చెందిన బాలికలు 07, జనరల్ లో బాలికలు మరియు బాలురు16, పి వి టి జి తెగకు చెందిన జనరల్ లో బాలురు 01మరియు బాలికలకు ఒకటి, ఇతరులకు జనరల్ లో బాలికలు 01 మరియు బాలురు 01 సీట్లను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని, అలాగే ఖమ్మం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మూడవ తరగతిలో 45 సీట్లకు గాను 30 మందిని, ఐదవ తరగతిలో 23 సీట్లకు లంబాడా తెగకు చెందిన బాలురు బాలికలు కలిపి 17 మందిని, ఎరుకల తెగకు చెందిన బాలురు ఒకటి, 8వ తరగతిలో జనరల్ లో 16 మందిని, ఎరుకల కులం బాలుడు 1 లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. డ్రాలో సీటు వచ్చిన పిల్లలు ఆయా తరగతులలో చేరకపోతే వెయిటింగ్ లిస్టులో ఉన్న పిల్లలకు సీట్లు కేటాయించబడతాయని ఆయన అన్నారు. పిల్లల యొక్క తల్లిదండ్రులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో సీట్లు సంపాదించిన పిల్లలను తప్పనిసరిగా చేర్పించాలని తెలుపుతూ, సీట్లు లభించిన బాల బాలికలకు ఆయన అభినందిస్తూ, బాగా చదివి మీ తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ భవాని, సి ఓ ఈ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఏ సి ఎం ఓలు రమేష్, రాములు, ఏటీడీవో సత్యవతి, డిడి ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం సిబ్బంది రామకృష్ణారెడ్డి, పాష, రంగయ్య, ప్రసాద్, శ్రీధర్, మణికుమార్, సురేష్, భద్రం మరియు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# దానవాయిపేటలో ఘనంగా 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమం

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం: సర్పంచ్ తుర్రం రవికుమార్



చర్ల, మే 14 (తెలంగాణ వాణి) తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్ల మండలం దానవాయిపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 'ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదట పాఠశాల ఆవరణలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ, వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించడమే 'బడి బాట' ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అందుబాటులో ఉన్న అన్ని వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ తుర్రం రవికుమార్ మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి బిడ్డ బడికి వెళ్లేలా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, దానవాయిపేట పాఠశాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'విద్య మా హక్కు', 'మీ పిల్లలను మన పాఠశాలలో చేర్పించండి' అనే నినాదాలతో ర్యాలీ సాగింది. 06-06-2027 నుండి 19-06-2026 వరకు జరిగే ఈ కార్యక్రమంలో 1 నుండి 7వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుర్రం రవికుమార్, వార్డు మెంబర్ కణితి రజని, ఉపాధ్యాయులు చింతకాయల హరిబాబు, రాజు, సుహాసిని, పీసా మొబలైజర్ రమేష్, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు.పాల్గొన్నారు

# ప్రజాసేవలో 40 ఏళ్లు పూర్తి చేసుకున్న మంత్రి తుమ్మల

## భద్రాచలంలో ఘన సన్మానం

## శాలవాతో సన్మానించిన పోలిన లంక రాజు



చర్ల, మే 14 (తెలంగాణ వాణి) తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సీనియర్ నాయకుడు, రాష్ట్ర మార్కెటింగ్ మరియు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ప్రజాసేవలో 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా భద్రాచలంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలిన లంక రాజు మాట్లాడుతూ, సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తుమ్మల నాగేశ్వరరావు తన క్రమశిక్షణ, పరిపాలనా దక్షత, ప్రజల సమస్యలపై అవగాహనతో రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట గుర్తింపు పొందారని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజాసేవలో కొనసాగుతూ పలు కీలక పదవులు నిర్వహించిన ఆయన అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రజలు ఎప్పటికీ మరియు మరచిపోలేనివిగా నిలిచాయని, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగ బలోపేతం, గ్రామీణ అభివృద్ధి వంటి అంశాల్లో తీసుకున్న నిర్ణయాలు వేలాది మంది రైతులకు, సాధారణ ప్రజలకు ఎంతో మేలు చేశాయని పోలిన లంక రాజు వివరించారు. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనను ప్రజలు అభివృద్ధి ప్రదాతగా అభివర్ణిస్తుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలిన లంక రాజు, సుందరి సురేష్, పోట్రూ బ్రహ్మానంద రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలవాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన తుమ్మల నాగేశ్వరరావు ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సహకారమే తన రాజకీయ ప్రస్థానానికి బలమని పేర్కొన్నారు. ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు పోలిన లంక రాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

# జన్ భగీదారీ - సబ్సే దూర్, సబ్సే పెహలే' కార్యక్రమం నిర్వహణ



భద్రాచలం, మే 14 (తెలంగాణ వాణి) ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (పీఎం జన్మన్ ) మరియు ధర్తి ఆబా జనజాతి గ్రామ ఉత్కర్ష అభియాన్ పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాలలో గిరిజనుల సంక్షేమం మరియు అభివృద్ధి లక్ష్యంగా "జన్ భగిదారీ – సబ్సే దూర్, సబ్సే పెహలే" కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ న్యూఢిల్లీ మోటా అడిషనల్ సెక్రటరీ శ్రీమతి సమిదా సింగ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం నాడు మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్ న్యూఢిల్లీ మోట కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రాల వారీగా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఐటీడీఏ పీవో బి. రాహుల్, సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు రాష్ట్రాల అధికారులకు సూచనలు ఇస్తూ ఈనెల 18 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు పీఎం జన్మన్, ధర్తీ ఆబ జంగ్ జాతి గ్రామ ఉత్కర్ష అభియాన్ పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాలలో జన్ భాగి దారి సబ్సే దూర్ సబ్సే పహలే కార్యక్రమంలో భాగం పీ వి టి జి మరియు ఇతర గిరిజన కుటుంబాలకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు అవుతున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించబడుననీ, అలాగే అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందే విధంగా గ్రామ స్థాయిలో సాచురేషన్ క్యాంపులు నిర్వహించబడునని అన్నారు. ఈ క్యాంపులలో ఆధార్ నమోదు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, విద్యా సహాయం, జీవనోపాధి పథకాలు, గృహ నిర్మాణ పథకాలు, పెన్షన్లు, బ్యాంకు ఖాతాల ప్రారంభం, ఆధార్ సీడింగ్, అటవీ హక్కుల అంశాలు తదితర సేవలను అందించడానికి సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని,అన్ని గ్రామాల గిరిజనులు, ముఖ్యంగా పి వి టి జి కుటుంబాలు, ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి బాటలో పయనించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పివిటిజి అధికారి గన్యా నాయక్, డిప్యూటీ ఆర్ ఎం ఓ పాయం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్, మే:14(తెలంగాణ వాణి ప్రతినిధి) నిర్మల్ మున్సిపాలిటీ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, నిర్మల్ మునిసిపాలిటీకి సంబంధించి పలు అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ప్రతిరోజు మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వాన కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. త్రాగునీరు నిల్వ ఉంచే నీటి ట్యాంకులను శుభ్రపరచాలని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా త్రాగునీరు అందించాలని వివరించారు. పట్టణంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పన్నుల వసూలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పట్టణ ఆదాయం పెంపుపై దృష్టి పెట్టాలని చెప్పారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగితే వెంటనే స్పందించి, ఆ సమస్యలు తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైటీపీఎస్‌లో మూడో యూనిట్ జాతికి అంకితం

**- సీఈ రమేష్ బాబును ఘనంగా సన్మానించిన టీఆర్‌వీకేఎస్**



దామరచర్ల,మే 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వై టి పి ఎస్ 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్ అందుబాటులోకి రావడం గర్వకారణమని జెన్కో చీఫ్ ఇంజనీర్ (సీఈ) వి. రమేష్ బాబు అన్నారు. మొత్తం 4,000 మెగావాట్ల (5ఇ800) సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో మూడో యూనిట్ విజయవంతంగా సీఓడీ (కమర్షియల్ ఆపరేషన్ డిక్లరేషన్) పూర్తి చేసుకున్న సందర్భంగా,టీఆర్‌వీకేఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఈ రమేష్ బాబుతో పాటు టీపీసీ పీవీ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చారుగుండ్ల రమేష్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 3,200 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో సీఈ రమేష్ బాబు కృషి, శ్రీనివాస్ సహకారం మరువలేనివని కొనియాడారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో మూడు యూనిట్లను విజయవంతంగా పూర్తి చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన కార్మికులు,ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది మరియు బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులకు ఆయన పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఈ రమేష్ బాబు మాట్లాడుతూ.. ఇంతటి భారీ ప్రాజెక్టులో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని, ప్రభుత్వం మరియు జెన్కో యాజమాన్యం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేశానని తెలిపారు. క్లిష్టతరమైన ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెన్కో అసిస్టెంట్ సెక్రటరీలు ఎం. ప్రేమ్ కుమార్, పి. సతీష్ కుమార్, వైటీపీఎస్ రీజినల్ కార్యదర్శి నాదేళ్ల రవికుమార్, రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ధారా ప్రసాద్,ఉపాధ్యక్షులు ఎస్.కె. యూసుఫ్, కొమ్మూరి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు ఉమర్ ఫరూక్, ఎండి. హబీబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆది రాజేష్, కమ్మగిరి రవి, సాజిద్, జి. నాగేశ్వరరావు, మహిళా ప్రతినిధి బండి త్రివేణి, నాయకులు అమీర్ ముదస్సర్, శేఖర్ బాబు,గడ్డం ప్రసాద్, ఓ.డి. రాజు, రామకృష్ణ,వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జొన్న రైతులు ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

**- అకాల వర్షం నేపథ్యంలో మార్కెట్ యార్డులో కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించిన:మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి**



ఆదిలాబాద్, మే : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) జొన్నల కొనుగోళ్ల విషయంలో రైతులు సమన్వయం పాటించాలని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షం నేపథ్యంలో గురువారం ఆయన ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా జొన్నలు, మక్కజొన్నల కొనుగోలు ప్రక్రియతో పాటు గోదాములలో నిల్వల విధానాన్ని స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ..అకాల వర్షం కారణంగా మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువచ్చిన జొన్నలకు పెద్దగా నష్టం జరగలేదని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి రైతు పండించిన జొన్నలను 100 శాతం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. గతంలో ఇతర పంటల కొనుగోళ్ల సమయంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్ల వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్‌తో కలిసి తాము ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకువచ్చే ముందు సంబంధిత ఏఈఓ వద్ద టోకెన్ తీసుకోవాలని సూచించారు. టోకెన్‌లో పేర్కొన్న తేదీ ప్రకారమే మార్కెట్ యార్డుకు రావాలని, తద్వారా కాంటా మరియు అన్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా సాగుతుందని తెలిపారు. కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి కేంద్రానికి సీనియర్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా జిల్లా కలెక్టర్ నియమించారని వెల్లడించారు. రైతుల సౌకర్యార్థం కజ్జర్ల గ్రామంలో రామాలయం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నుంచి కొత్త కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మార్కెట్ యార్డుకు జొన్నలను తీసుకువచ్చి అధికారులకు సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



ఉట్నూర్ .మే :14 (తెలంగాణ వాణి ) ఉట్నూర్ మండలం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవంలో పాల్గొన్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ . కలశాల సిబ్బంది ఎమ్మెల్యే కి స్వాగతం పలికారు,ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కలశాల లో సమస్యలు తెలియజేసిన వెంటనే పరిష్కరించారని,ఆదివాసీ విద్యార్థుల అభ్యునాతికి కృషి చేస్తున్నాం అని సౌకర్యాలు కల్పిస్తునందుకు ధన్యవాదాలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యత పెంచుటకు ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుంది అని,ఉట్నూర్ డిగ్రీ కళాశాలలో సమస్యలు తెలియగానే పుస్తకాలు ఇప్పించాం , ప్రహరీ గోడ నిర్మించాం, ఇంకా కావలసిన వసతులు కల్పనకు కృషి చేస్తాం అన్నారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు చెట్లు నాటుతూ ,పర్యావరణ రక్షణలో భాగం కావలి అన్నారు కళాశాలలో బయో ,కెమిస్ట్రీ ల్యాబ్స్ పరిశీలించారు, మెడికల్ క్యాంప్ ప్రారంభించారు. కళాశాలలో విద్యార్యుల సంఖ్య పెంచేందుకు కృషి చెయ్యాలి, ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య బలోపేతానికి కృషి చేస్తుంది అన్నారు.ఎమ్మెల్యే గారికి సిబ్బంది శాలువాతో సన్మానించారు. సర్పంచ్లకు ఎమ్మెల్యే గారు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కలశాల ప్రిన్సిపల్,అధ్యాపకులు,విద్యార్థులు,సర్పంచ్లు, పేరెంట్స్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ఘోర ప్రమాదం

**- డీసీఎం ఢీకొని తల్లి, కుమారుడు దుర్మరణం**







మిర్యాలగూడ:రూరల్,మే 14 (తెలంగాణ వాణి ప్రతినిధి) మిర్యాలగూడ మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో తల్లి, కుమారుడు మృతి చెందారు. కిష్టాపురం గ్రామ శివారులోని అన్నపూర్ణ రైస్ మిల్లు వద్ద వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఈ విషాదం నెలకొంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ ఎం. లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం సాత్ తండా గ్రామానికి చెందిన మాలోతు సుజాత, ఆమె కుమారుడు మాలోతు చంటి కలిసి మిర్యాలగూడకు కంటి పరీక్షల నిమిత్తం వచ్చారు. పరీక్షలు ముగించుకొని తిరిగి తమ స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, కిష్టాపురం వద్ద మిర్యాలగూడ వైపు నుండి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన డీసీఎం (౬+౦౯౦375) వీరి వాహనాన్ని వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారు రోడ్డుపై పడిపోగా, డీసీఎం చక్రాలు సుజాతపై నుండి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన చంటిని చికిత్స నిమిత్తం వెంటనే మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ చంటి మృతి చెందాడు. మృతురాలి భర్త రామారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మరణించడంతో సాత్ తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు**



మంచిర్యాల,మే 14 (తెలంగాణ వాణి): జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు అన్నారు. గురువారం జిల్లాలోని కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గోదాములుగా మార్చిన జైపూర్ మండలం రామారావుపేటలో గల సుముఖ డిఫాల్టర్ రైస్ మిల్లు, హాజీపూర్ మండలం నర్సింగాపూర్ లో గల రాజరాజేశ్వరి డిఫాల్టర్ రైస్ మిల్లులను కార్మిక శాఖ సహాయ కమిషనర్ క్రాంతి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో హమాలీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వరి ధాన్యం దిగుమతి త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేయాలని తెలిపారు. జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండా వరి కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని, కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ: జిల్లా కలెక్టర్



మంచిర్యాల,మే 14 (తెలంగాణ వాణి):2026-27 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ లోని బేగంపేటలో గల హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం కొరకు షెడ్యూల్ కులములకు చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు జిల్లా నివాసులై ఉండి జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య జన్మించి ఉండాలని, జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా మీసేవ/ మున్సిపల్ కార్పొరేషన్/ తహసిల్దార్ ద్వారా జారీ చేయబడి ఉండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో 1 లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు కుల, ఆదాయ, జనన తేదీ, నివాస ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు జత చేసి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని, జూన్ 1వ తేదీన డ్రా పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్ అభివృద్ధి శాఖ కార్యాలయంలో పనివేళలలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ఏద మినిస్ట్రీస్ సంఘ సభ్యుల తో నూతన ఇందిరమ్మ గృహ ప్రవేశం



ఎల్లారెడ్డి మే 14 తెలంగాణ వాణి ప్రతినిధి ఏద మినిస్ట్రీస్ సంఘ సభ్యులు జలాల్పూర్ ప్రాంతానికి చెందిన సిస్టర్.సాయమ్మ మరియు బ్రదర్.పీరయ్య కుటుంబమునకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్మించి ఇచ్చిన ఇందిరమ్మ ఇల్లును బట్టి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ దైవ సేవకులైనటువంటి బ్రదర్.శ్రీనివాసాచారి మరియు సిస్టర్.హెప్సిబా చారి గార్లలి ద్వారా వారి గ్రామంలో జరిగిన నూతన గృహప్రవేశ కూడిక దేవునికి మహిమకరంగా జరిగింది. ఈ గృహమును పొందడానికి సహాయం చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ గారి కొరకు అధికారుల కొరకు ప్రార్ధన చేసారు.

## జనగణనకు మండల ప్రజలందరూ సహకరించాలి

**- రాయికోడ్ తహసీల్దార్ ఆశా జ్యోతి**



రాయికోడ్, మే 14 (తెలంగాణ వాణి ప్రతినిధి):సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో భారత జనగణన--2027 సన్నాహక కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయ ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లు క్షేత్ర స్థాయిలో గృహాల వివరాల సేకరణ (Enumeration) ప్రక్రియను నిర్వహిస్తున్నారని మండల ఛార్జ్ ఆఫీసర్ మరియు తహసీల్దార్ ఆశా జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనగణన అనేది దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని కొనియాడారు. భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు మరియు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఈ గణాంకాలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. మండలంలోని ప్రతి కుటుంబం తమకు సంబంధించిన పూర్తి మరియు సరైన సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు అందించి, ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు. జనగణన సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరిస్తారని, ప్రజలు వారికి పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సేకరించిన వివరాలన్నీ అత్యంత గోప్యంగా ఉంచబడతాయని, కావున ప్రజలు ఎలాంటి సందేహాలు పెట్టుకోకుండా వాస్తవ సమాచారాన్ని అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్యూమరేటర్లు మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందు పై ప్రతిష్టమైన చర్యలు.

**- బక్రీద్ సందర్భంగా చెక్పోస్టులో అప్రమత్తంగా ఉండాలి.**

**- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్, మే : 14 ( తెలంగాణ వాణి ప్రతినిధి ) స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ సిబ్బంది అందరితో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలపై సమగ్రంగా సమీక్ష చేపట్టి, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు జిల్లా ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న ప్రతి ఒక్క కేసు పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు, కేసుల నందు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు న్యాయం చేసే విధంగా దర్యాప్తును కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న 7 వర్టికల్స్ బయల్ హండ్రెడ్, ఇన్వెస్టిగేషన్, కోర్ట్, సెక్షన్ ఇంచార్జ్, రికార్డ్స్, క్యూఆర్ కోడ్, రిసెప్షన్ లాంటి వర్టికల్స్ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందుల విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగించాలని, రైతులను మోసం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు మెరుగుపడేలా ఎస్హెచ్ఓలు పర్యవేక్షణ పెంచాలని, ప్రతి ఒక్కరికీ సమాన విధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, నేరాల నియంత్రణలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే రాత్రి సమయాల్లో గస్తీ మరింత బలోపేతం చేసి, అసాంఘిక కార్యకలాపాలు, గ్యాంబ్లింగ్ వంటి చట్టవిరుద్ధ చర్యలను, నేరాలను, ఆర్థిక నేరాలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో సిసిటిఎన్ఎస్, సిడిఓ, డయల్-100, బ్లూ కోర్ట్, స్టేషన్ రైటర్, రికార్డులు పెండింగ్స్ లేకుండా సమయానుకూలంగా నవీకరించాలన్నారు. నేరస్తుల ఫింగర్ ప్రింట్లను సేకరించి ఆన్లైన్‌లో నమోదు చేయడం ద్వారా కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను ప్రోత్సహిస్తూ, వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బి. సురేందర్ రావు ఓఎస్డీ, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్. జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్ మరియు సిఐలు, ఆర్ ఐ లు, ఎస్ఐలు, డి సి ఆర్ బి, ఎన్ఐబి, ఐటి కోర్, పోలీసు కార్యాలయ సిబ్బంది, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన

# మానస వారణాసి!

టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజాగా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెరపై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.



# ఎత్తుల భయాన్ని జయించా: రష్మిక

ప్రస్తుతం కొచ్చిలో 'మైసా' చిత్ర షూటింగ్‌లో ఉన్న రష్మిక, తనకు ఎంతో కాలంగా ఉన్న 'ఎత్తుల భయాన్ని' అధిగమించినట్లు సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం ఆమె డూప్ లేకుండా 80 అడుగుల ఎత్తు నుంచి దూకి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ క్రమంలో ఆమె చేతులు, కాళ్లకు గాయాలైనా లెక్కచేయకుండా షూటింగ్‌ను కొనసాగించడం ఆమె అంకితభావానికి నిదర్శనం. అడవులు, ట్రెక్కింగ్‌లు, వర్షాల మధ్య ఈ షూటింగ్ తనకు కొత్త శక్తిని ఇచ్చిందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.మరోవైపు, రష్మిక - విజయ్ దేవరకొండ జోడీ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. వీరిద్దరూ కలిసి నటించిన ఒక వాణిజ్య ప్రకటన ఇన్‌స్టాగ్రామ్‌లో 9.1 మిలియన్లకు పైగా లైక్స్ సాధించి, ప్రపంచవ్యాప్తంగా అత్యధిక లైక్స్ పొందిన రెండో ప్రకటనగా రికార్డు సృష్టించింది. విశేషమేమిటంటే, ఈ జాబితాలో 11.5 మిలియన్ల లైక్స్‌తో మొదటి స్థానంలో ఉన్నది కూడా ఈ జోడీకి సంబంధించిన మరో ప్రకటన కావడం విశేషం. ప్రస్తుతం వీరిద్దరూ కలిసి 'రణబాలి' అనే చిత్రంలో నటిస్తున్నారు.

# వయసుపై చర్చ..

## – టబు అసహనం



సినీ రంగంలో నటీమణుల వయసుపై సమాజం, పరిశ్రమ చూపిస్తున్న అత్యుత్సాహంపై టబు ఘాటుగా స్పందించారు. "మన వయసు గురించి మనకంటే ఇతరులకే ఎక్కువ ఆందోళన ఉంటుంది" అని ఆమె ఎద్దేవా చేశారు. వయసు పెరగడం అనేది సహజమైన ప్రక్రియ అని, అది ఒక్క రోజులో జరిగేది కాదని ఆమె గుర్తు చేశారు. మహిళలు సాధిస్తున్న విజయాల కంటే వారి వయసు గురించి చర్చించడం బాధాకరమని, దీనివల్ల నటీమణులపై అనవసరమైన ఒత్తిడి పెరుగుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలను తిరస్కరించే విషయంలో తాను అనుసరించే పద్ధతిని కూడా ఆమె వివరించారు. చాలా మంది డేట్స్ లేవని అబద్ధం చెప్పమని సలహా ఇచ్చినా, తాను మాత్రం స్క్రిప్ట్ నచ్చకపోతే ఆ విషయాన్ని ముఖం మీదనే చెప్పేస్తానని టబు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె తన తాజా చిత్రం 'భూత్ బంగ్లా' విజయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న 'స్లమ్ డాగ్' చిత్రంలో నటిస్తున్నారు. నాగార్జున 100వ చిత్రంలో ఆమె కీలక

## 'జన నాయగన్' కోసం రంగంలోకి

# సీఎం విజయ్..

### – కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!



తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర నటుడు విజయ్ తన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమం చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సెన్సార్ సమస్యల కారణంగా విడుదల ఆగిపోయి ప్రస్తుతం రివైజింగ్ కమిటీ వద్ద ఉన్న ఈ సినిమా అడ్డంకులను తొలగించే పనిపై ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్ర నిర్మాతను తక్షణమే చెన్నైకి తిరిగి రావాలని విజయ్ సూచించినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.విజయ్ నటుడిగా చేస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ఒకవైపు పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూనే తన సినిమా విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని భావిస్తున్నారు.

ఈ క్రమంలోనే కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్ ను కేన్స్ పర్యటన మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరి రావాలని విజయ్ కోరినట్లు సమాచారం. విజయ్ పిలుపుతో నిర్మాత చెన్నైకి పయనమైనట్లు తెలియడంతో, త్వరలోనే 'జన నాయగన్' విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ పరిణామంతో విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటీటీకి వచ్చేసిన భారీ యాక్షన్ థ్రిల్లర్!



కోలీవుడ్ లో యాక్షన్ హీరోల జాబితాపై ఒక లుక్ వేస్తే, 'ఆర్య' పేరు ముందు వరుసలోనే కనిపిస్తుంది. ఒక యాక్షన్ హీరోకి ఉండవలసిన లక్షణాలు పుష్కలంగా ఉన్న హీరో అనే విషయం ఆయనను చూడగానే అర్థమైపోతుంది. అందువల్లనే ఆయన ఆ తరహా సినిమాలు ఎక్కువగా చేస్తూ వెళుతున్నాడు. కెరియర్ పరంగా చాలా నిదానంగా ముందుకు వెళుతూ, తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలతోనే ఫ్యాన్స్ ను మెప్పిస్తున్నాడు. అలాంటి 'ఆర్య' నుంచి రీసెంటుగా వచ్చిన సినిమానే 'మిస్టర్ ఎక్స్'. మను ఆనంద్ తెరకెక్కించిన భారీ యాక్షన్ థ్రిల్లర్ ఇది. లక్ష్మణ్ కుమార్ - వినీత్ జైన్ భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, ఏప్రిల్ 17వ తేదీన థియేటర్లకు వచ్చింది. మిక్స్డ్ టాక్ తెచ్చుకున్న ఈ సినిమా, నెల తిరిగేలోగానే ఓటీటీకి వచ్చేసింది. ఈ రోజు (మే 14)నుంచి ఈ సినిమా జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ భాషల్లో అందుబాటులో ఉంది. 1965 నాటి కాలంతో ముడిపడిన ఒక స్పై మిషన్ నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. గౌతమ్ కార్తీక్ .. శరత్ కుమార్ .. మంజు వారీయర్ .. అనఘ .. అతుల్య రవి .. రైసా విల్సన్ ఇతర ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. కనిపించకుండా పోయిన న్యూక్లియర్ క్యాప్సిల్స్ చుట్టూ తిరిగే ఈ కథ, యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారిని మెప్పిస్తుందనే టాక్ వచ్చింది. విజువల్స్ .. యాక్షన్ సీన్స్ .. భారీతనం ఈ సినిమాలో ప్రధానమైన బలంగా నిలిచాయి. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఎన్ని మార్కులు దక్కించుకుంటుందనేది చూడాలి మరి.

# 'పెద్ది' సినిమాతో కొత్త బిజినెస్ లోకి హోంబలే ఫిల్మ్స్!




'కేజీఎఫ్', 'కాంతార', 'సలార్' వంటి భారీ విజయాలతో దేశవ్యాప్తంగా పేరు పొందిన ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మరో కీలక ముందడుగు వేసింది. నిర్మాణ రంగంలో అగ్రగామిగా ఉన్న ఈ సంస్థ, ఇప్పుడు అంతర్జాతీయ పంపిణీ రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ ప్రయాణంలో తమ తొలి చిత్రంగా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది'ని ఎంచుకుంది.భారతీయ కథలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు చేరవేయాలనే లక్ష్యంతో హోంబలే ఫిల్మ్స్ తన ఓవర్సీస్ పంపిణీ విభాగాన్ని ప్రారంభించింది. దీనికి నాందిగా 'పెద్ది' చిత్రాన్ని ఎంచుకోవడం విశేషం. ఈ నిర్ణయంతో రామ్ చరణ్ సినిమాకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీ ప్రచారం లభించనుంది. హోంబలే వంటి పెద్ద సంస్థ నేరుగా పంపిణీ చేస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా కీలక దేశాల్లో భారీ స్థాయిలో విడుదల ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రామ్ చరణ్ ఇంటెన్స్ మేకోవర్, పవర్‌ఫుల్ విజువల్స్‌తో కూడిన ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. దీనికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. ఇప్పుడు హోంబలే ఫిల్మ్స్ కూడా తోడవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com